

సాక్షి
హనుమకొండ
గురువారం । 3 । అక్టోబర్ । 2024

ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ..

శోభాయమానంగా ఎంగిలిపూల బతుకమ్మ





ఎల్కతుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





కొత్తవాడ తోట మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ సత్యశారద తదితరులు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో బుధవారం సాయంత్రం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు శోభాయమానంగా జరిగాయి. గౌరీదేవిని కొలుస్తూ బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా రాధేశ్యాం సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ బతుకమ్మ పాటల పోటీలు జరిగాయి. వరంగల్ ఎంపీ కావ్య, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమ, కూతురు గోదాదేవి, రాధేశ్యాం సాహితీసంస్థ వ్యవస్థాపకులు దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కొత్తవాడ తోటమైదానంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ కలెక్టర్ సత్యశారద, మేయర్ సుధారాణి బతుకమ్మ ఆడిపాడారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. పరకాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానం(పశువుల సంత) ప్రాంగణం మైదానంలో పెద్ద సంఖ్యలో మహిళలు బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. శ్రీచెన్న కేశవస్వామి దేవస్థానంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు మండల కేంద్రంలో వేడుకల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి హాజరయ్యారు.



బతుకమ్మలతో సెల్ఫీ



బతుకమ్మ పేరుస్తున్న ఎంపీ కావ్య

- మరిన్ని ఫొటోలు 11లో ▸

న్యూస్‌రీల్

వంతెన నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటు



హన్మకొండ: వారం రోజుల నుంచి గత ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే తామంటే తామే వంతెన నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. బుధవారం హనుమకొండ నయీంనగర్ నాలాపై నిర్మించిన వంతెనను బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, కార్పొరేటర్లు, నాయకులతో కలిసి సందర్శించారు. వంతెన, నాలాపై నిర్మిస్తున్న రివిట్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించారు. ముందుగా వంతెనపై జాతిపిత గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ద్వారానే నయీంనగర్ నాలాపై వంతెన నిర్మాణం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చాడా స్వాతి, గుజ్జుల వసంత, నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, కొలను సంతోశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురేఖపై అనుచిత పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు

వరంగల్/ఖిలావరంగల్/రామన్నపేట/మడికొండ: రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె కూతురు సుస్మిత పటేల్‌పై సోషల్ మీడియాలో అనుచిత వాఖ్యలు చేస్తూ నిరాధారమైన నిందలు వేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వరంగల్ తూర్పు కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం ఇంతేజార్ గంజ్, మట్టెవాడ, మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. అదేవిధంగా మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కంప్లయింట్ ఇచ్చారు.

నిరసన బతుకమ్మ



కాజీపేట అర్బన్: కేఎల్‌ఎస్ రెడ్డి కాలనీలో ప్రతీ ఏడాది మహిళలు బతుకమ్మ ఆడుకునే స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని నిరసన తెలపుతూ.. మహిళలు బుధవారం రోడ్డుపై బతుకమ్మ ఆడారు. గణపతి నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ జరుపుకునేందుకు స్థలం లేక రోడ్డుపైనే వేడుకలు జరుపుకుంటున్నామని వారంతా వాపోయారు.

దేవుడా.. ఏంటీ రచ్చ?

వరంగల్ చౌరస్తా: వరంగల్ నగరంలోని గోవిందరాజ స్వామి ఆలయంలో రెండేళ్లుగా నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు రచ్చకెక్కాయి. మితిమీరిన రాజకీయ జోక్యం చివరికి దాడులు చేసుకునే స్థాయికి చేరింది. బుధవారం ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు మురళిస్వామి తనపై స్థానిక లీడర్ చెయ్యి చేసుకుని ఆలయం నుంచి పంపించినట్లు ఆరోపించాడు. అంతేకాకుండా కొద్ది రోజులుగా ఆలయంలో కొత్త అర్చకులు పూజలు జరిపేలా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నాడు. తాను దాడి చేయలేదని, కావాలని భక్తులను తప్పుదోవ పట్టిస్తున్నట్లు సదరు అధికార పార్టీ నాయకుడు పేర్కొంటున్నాడు. కాగా.. గోవిందరాజుల గుట్ట దేవాలయ భూములే లక్ష్యంగా చేసుకొని రాజకీయ నాయకులు తరచూ గుట్ట సమీప వాసులను(ఆలయ భూమి ఆక్రమణదారులను), అర్చకులను, స్థానికులను అనేక రకాలుగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. గతంలో ఇద్దరు కార్పొరేటర్లు ఇదే తరహాలో భూముల విషయంలో స్థానిక భూ ఆక్రమణదారుల నుంచి సర్వే పేరిట పెద్ద ఎత్తున డబ్బులు దండుకున్నట్లు విమర్శలున్నాయి. గోవిందరాజుల గుట్ట దేవాలయంలో అర్చకులు, భూముల వ్యవహారం రచ్చగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకుని వివాదాల్ని పరిష్కరించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

విషాదం నింపిన పిడుగు

చౌళ్లపల్లిలో ఇద్దరు మహిళా కూలీల మృతి



వ్యవసాయ కూలీల మృతదేహాలు

ఆత్మకూరు: మండలంలో రోజంతా ఎండ దంచికొట్టింది. సాయంత్రం పూట ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మేఘాలు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. పంట క్షేత్రంలో పనిలో నిమగ్నమైన రైతులు, రైతు కూలీలు సమీప చెట్ల కిందకు పరిగెట్టారు. అందరూ ఒక చెట్టు దగ్గరికి పెరిగెడితే.. ఇద్దరు మహిళా రైతు కూలీలు మాత్రమే మరో చెట్టు కిందకు వెళ్లారు. ఠాట్‌మంటూ ఒక్కసారిగా వారిద్దరిపై పిడుగు పడింది. ఆరెండు కూలీ కుటుంబాల్లో పిడుగుపాటు విషాదాన్ని నింపింది. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలను పిడుగుపాటు ఉక్కిరిబిక్కిరి చేసింది. పిడుగుపాటుతో మండలంలోని చౌళ్లపల్లిలో వ్యవసాయ కూలీలు ఇటుకాల నిర్మల (51), సోలెంక రమ(45) మృతి చెందారు. ఇటుకాల నిర్మల భర్త రాజేందర్ కూలీ పనులు చేసుకుంటున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు ముగ్గురికి పెళ్లి చేశారు. పెళ్లి ఖర్చుల కోసం వీరికున్న రెండెకరాల భూమిని విక్రయించారు. దీంతో వీరికి ఎలాంటి ఆస్తులు లేవు. పిల్లల బాగోగులు చూడడానికి ఇద్దరు భార్యాభర్తలు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈక్రమంలో పిడుగు నిర్మలను పొట్టన పెట్టుకోవడంతో భర్త రాజేందర్, కుమార్తెలు బోరున విలపించారు. సోలెంక రమ భర్త మహేందర్ కారు డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా.. పెద్ద కుమారుడికి వివాహమైంది. చిన్న కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. రమ మృతితో కుటుంబంలో విషాదం నిండింది. బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. కూలీల మృతికి సంతాపం తెలిపారు.

ఇందిరమ్మ పాలనంటే ఇళ్లు కూల్చడమా?

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్: ఇందిరమ్మ పాలన అంటే పేదల ఇళ్లు కూల్చడమేనా? అని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస, శాడిస్ట్, సైకో పాలన సాగుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కి హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో బీఆర్‌ఎస్‌కు ఓట్లేసిన ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. «నిజాయితీగా రాజకీయాలు చేస్తానని చెప్పుకునే ఎమ్మెల్యే కడియం శ్రీహరి భేషరతుగా రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని... అప్పుడు నువ్వా నేనా? తేల్చుకుందాం» అని సవాలు విసిరారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి నేటి వరకు నియోజకవర్గానికి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. కక్కుర్తి రాజకీయాలు చేసే కడియం శ్రీహరిది భస్మాసుర హస్తమని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బొడ్డు ప్రభుదాస్, మాజీ జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు జుబేదా–లాల్ మహమ్మద్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బేరే వీరన్న, మాజీ సర్పంచ్ కర్ర సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బొడ్డు శోభ, లక్క శ్రీనివాస్, రేమిడి మహేందర్ రెడ్డి, బోడ్డు ప్రతాప్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



ఇంటివద్ద జన్మించిన నవజాత శిశువును చూపుతున్న చైతన్య

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన భార్గవి పురిటి నొప్పులతో బాధపడుతోందని భర్త రాజు బుధవారం ఉదయం 5.30 గంటలకు 108కు కాల్ చేశాడు. కాగా.. హనుమకొండలోని ఐఆర్‌సీఎస్ వద్ద ఉన్న 108 అంబులెన్స్ వాహనంలో ఈఎంటీ చైతన్య, పైలెట్ వెంకటేశ్ గ్రామానికి చేరుకున్నారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వారు ఇంటి వద్దే ప్రసవం చేశారు. కాగా.. భార్గవి మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం వారిని 108 అంబులెన్స్ వాహనంలో వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రికి తీసుకెళ్లి అడ్మిట్ చేశారు. రాజు కుటుంబ సభ్యులు చైతన్య, వెంకటేశ్ సమయస్ఫూర్తిని అభినందించారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షురూ



సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకుంటున్న ఎస్జీటీ అభ్యర్థులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని ఎస్జీటీ తెలుగు మీడియం, ఉర్దూ మీడియం మెరిట్ లిస్టును సంబంధిత డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో బుధవారం నుంచి హనుమకొండ జిల్లాకు చెందిన అభ్యర్థులకు సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభించారు. డీఈఓ వాసంతి పర్యవేక్షణలో 10 కమిటీలను ఏర్పాటు చేసి 10 కౌంటర్లను ఏర్పాటు చేశారు. పీజీహెచ్‌ఎంలు, డీఈఓ కార్యాలయ సిబ్బంది కలిసి సర్టిఫికెట్లు పరిశీలించారు. జిల్లాలో 81 ఎస్జీటీ పోస్టులకుగాను 206 మంది అభ్యర్థులకు మెరిట్ లిస్టును వెల్లడించారు. ఎక్కువ పోస్టులకు ముగ్గురి చొప్పున మరికొన్నింటిలో వివిధ కేటగి రీలో ఒక్కరిద్దరే ఉన్నారు. తొలిరోజు 47 మంది ఎస్జీటీ మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఈనెల 4 వరకు ఇందుకు అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో వివిధ సబ్జెక్టుల ఎస్‌ఏలతోపాటు లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలు మెరిట్‌కమ్ రోస్టర్ ప్రకారం మెరిట్ లిస్ట్ బుధవారం వెల్లడించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈఓహెచ్ ఎన్‌కే.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. 106 పోస్టులకు ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున మెరిట్ లిస్టును వెల్లడించారు. వీరికి కూడా ఈనెల 3వ తేదీ నుంచి సుబేదారి ప్రభుత్వ హైస్కూల్‌లో హాజరై సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయిచుకోవాల్సి ఉంటుంది. డీఎస్సీకి దరఖాస్తు చేసినప్పుడు జత చేసిన ధ్రువపత్రాలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో రా వాల్సి ఉంటుంది. గురువారం ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు హాజరు కానున్నారు.

ఒకే రాష్ట్రం.. ఒకే కార్డు : కలెక్టర్

వరంగల్: ఒకే రాష్ట్రం.. ఒకే కార్డు అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందించనుందని వరంగల్ కలెక్టర్ సత్య శారద తెలిపారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఈనెల 3 నుంచి 7 వరకు 'ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ ప్రాజెక్టు'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కలెక్టరేట్‌లో బుధవారం అధికారులకు శిక్షణ ఇచ్చారు.

జాతిపితకు ఘన నివాళి



పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు, సీపీ అంబర్‌కిషోర్‌ఝా



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

హన్మకొండ చౌరస్తా: గాంధీ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి పలువురు ప్రముఖులు ఘన నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా భారత దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ చూపిన మార్గం, అనుసరించిన సిద్ధాంతాలను స్మరించుకున్నారు. నేటి తరం గాంధీజీ మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు. గాంధీజీకి నివాళులు అర్పించిన వారిలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, అరూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో..

వరంగల్ క్రైం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొని జాతిపిత చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కాంగ్రెస్ నేత నవీన్‌రాజ్‌కు గన్‌మెన్ల తొలగింపు

వరంగల్ క్రైం: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు కాంగ్రెస్ నేత నవీన్‌రాజ్‌కు ఉన్న ఇద్దరు గన్‌మెన్లను బుధవారం తొలగించారు. దీంతో గన్‌మెన్లు హెడ్ క్వార్టర్‌లో రిపోర్ట్ చేశారు. నవీన్‌రాజ్‌పై ఇటీవల తీవ్ర స్థాయిలో రకరకాల ఆరోపణలు వెలువడ్డాయి. మంగళవారం విధుల్లో ఉన్న హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌పై నవీన్‌రాజ్ దురుసుగా ప్రవర్తించడం, పదుల సంఖ్యలో ఆయనపై పోలీసులకు ఫిర్యాదులు అందడం, ఏకంగా కొంతమంది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం వంటి పరిణామాల నేపథ్యంలో గన్‌మెన్లను తొలగించారు. తూర్పు, పరకాల నియోజకవర్గాల్లో జరుగుతున్న కొన్ని ఘటనలపై ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు సమర్పించినట్లు సమాచారం. ఉన్నతాధికారుల సూచనల మేరకు గన్‌మెన్లను తొలగించారు.

ఉపాధి పనుల్లో అగ్రస్థానంలో నిలపాలి



ముల్కనూరు గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వందశాతం నిర్వహించి ముల్కనూరు గ్రామాన్ని అగ్రస్థానంలో నిలపాలని డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఏర్పాటు చేసిన గ్రామ సభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న జీపీ కార్మికులను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్లతోటల పెంపకంపై ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకోవాలని రైతులకు సూచించారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచి పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారని భవిష్యత్‌లో అదేవిధంగా జరిగేలా చూడాలన్నారు. జీపీ నిధులతో సిబ్బందికి పదిలక్షల ఇన్సూరెన్స్ చేయించి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు వీరేశం, విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు మాడుగుల కొమురయ్య, నిరంజన్‌రెడ్డి, రాజు, రవీందర్, తిరుపతి, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోణార్క్, సాయినగర్ రైళ్ల దారి మళ్లింపు

● అక్టోబర్ 7వ తేదీ వరకు కొనసాగింపు

కాజీపేట రూరల్: కాజీపేట–విజయవాడ–బల్లార్షా సెక్షన్లో రైల్వే మూడో లైన్ పనులు, ఇంజనీరింగ్ వర్క్‌తో పలు రైళ్లను రద్దు, దారి మళ్లించి, రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. గత నెల 26వ తేదీన ప్రారంభమైన రైల్వే పనులు ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్నట్లు వివరించారు. కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే భువనేశ్వర్–ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) అక్టోబర్ 6వ తేదీ వరకు, సాయినగర్–కాకినాడ (17205) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీ వరకు, కాకినాడ–సాయినగర్ (17206) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 5,7వ తేదీ వరకు కాజీపేట జంక్షన్‌కు రాకుండా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మళ్లించారు. ఆదిలాబాద్–తిరుపతి (17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీ వరకు సికింద్రాబాద్, గుంటూరు మీదుగా తిరుపతికి మళ్లిస్తున్నట్లు వారు తెలిపారు. వరంగల్‌లో 4 రోజులు, కాజీపేట ఎఫ్ క్యాబిన్ వద్ద 9 రోజులు, హసన్‌పర్తి వద్ద 4 రోజుల రైల్వే నాన్ ఇంటర్ లాకింగ్ వర్క్ కారణంగా కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 98 రైళ్ల రద్దు, 59 రైళ్లను దారి మళ్లింపు, 29 రైళ్లు రీషెడ్యూల్‌తో నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు వివరించారు. కాగా, రైళ్ల రద్దు, దారి మళ్లింపు, రీషెడ్యూల్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రైల్వే ఎంక్వైరీ ద్వారా, రైల్వే యాప్‌ల ద్వారా సమయ వివరాలను తెలుసుకునేందుకు యత్నిస్తున్నారు. కొందరు రిజర్వేషన్ రద్దు చేసుకుంటున్నారు.

పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారని..

● పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం


108 వాహనంలో రాజు

గణపురం: తన తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన మోటపోతుల రాజు గ్రామంలో పలువురు వద్ద అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి రాజు తల్లిదండ్రులను తీర్చమని అడుగుతున్నారు. దీంతో రాజును తల్లిదండ్రులు మందలించారు. ఈ ఘటనపై రాజు తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డాడు. దీంతో రాజు తండ్రి సమ్మయ్య బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా స్టేషన్‌కు రావాలని పోలీసులు ఆదేశించారు. ఆందోళనకు గురైన రాజు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో రాజును ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎస్సై తెలిపారు.

ఎదురుచూపులు ఎంతకాలం?

జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఆవేదన

- 2023 మార్చి 31న నియామకాలకు నోటిఫికేషన్
- 2023 జూన్ 4న రాత పరీక్ష..
- ఈ ఏడాది ఆగస్టు 1న ఫలితాలు వెల్లడి, 22న సర్టిఫికెట్ల పరిశీలన
- ఇప్పటికీ అందని నియామక ఉత్తర్వులు
- జాప్యం చేస్తున్న టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం

హన్మకొండ : వారంతా 16 నెలల క్రితం పరీక్ష రాశారు. ఇందులో ఉత్తీర్ణులయ్యారు.. పైగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా చేయించుకున్నారు. అయినా నియామక ఉత్తర్వులు అందడం లేదు. ఫలితంగా ఉద్యోగంలో చేరేదీ ఎప్పుడెప్పుడా అని వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. వారే టీజీ ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు. కాగా, సెప్టెంబర్ 30న డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం.. ఈ నెల 9న ఉపాధ్యాయ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందించనుంది. ఫలితాలు విడుదల చేసిన 10 రోజుల్లోనే డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తుండగా.. ఆగస్టు 1న ఫలితాలు విడుదల చేసి అదే నెల 22న సర్టిఫికెట్లు పరిశీలన జరిపినా ఇప్పటి వరకూ టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టులు భర్తీ చేయకపోవడంలో ఆంతర్యమేమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు..

మరో వైపు ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ మేరకు ఎన్పీడీసీఎల్‌లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు జరుగుతున్నాయి. అయినా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ పోస్టుల భర్తీలో వేగం కనిపించడం లేదు. 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ పోస్టుల భర్తీకి యాజమాన్యం 2023 మార్చి 31న నోటిఫికేషన్ విడుదల చేసింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 2023 మే 28న జరగాల్సిన రాత పరీక్ష వివిధ కారణాలతో వాయిదా వేశారు. తిరిగి 2023 జూన్ 4న హైదరాబాద్ కేంద్రంగా రాతపరీక్ష నిర్వహించారు. ఫలితాలు వెల్లడిలో తీవ్ర జాప్యం జరిగింది. నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. తర్వాత కొద్ది రోజులకు ఎన్నికలు రావడంతో పాటు రాష్ట్రంలో మార్పు జరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియను 65 రోజుల్లో పూర్తి చేసింది. అయితే ఎన్పీడీసీఎల్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టు రాత పరీక్ష జరిగి 16 నెలలు గడుస్తున్నా నేటికీ నియామక ఉత్తర్వులు అందించడంలో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.



14 నెలలకు ఫలితాలు విడుదల

రాత పరీక్ష జరిగిన 14 నెలలకు ఫలితాలు విడుదల చేసి అర్హుల జాబితా విడుదల చేసిన యాజమాన్యం.. సర్టిఫికెట్ల పరిశీలన జరిపి 41 రోజులు గడుస్తున్న నేటికీ నియామక పత్రాలు అందించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇతర శాఖల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతుండగా ఎన్పీడీసీఎల్‌లో ఆలస్యమైన కొద్దీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. మరో వైపు సిబ్బంది కొరతతో ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులపై పని భారం పెరిగింది. దీంతో వారు కూడా జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల భర్తీ జరగాలని భావిస్తున్నారు.

తీవ్రంగా వేధిస్తున్న ఉద్యోగుల కొరత..

మరో వైపు రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో టీజీ ఎన్పీడీసీఎల్‌లో సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్ల పునర్విభజన జరిగింది. ఈ మేరకు పోస్టులు మంజూరు కాకపోవడంతో ఉన్న వారినే సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో ఆయా కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ ఉద్యోగాల భర్తీ ఆలస్యం అవుతుండడంతో పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమైన ఎన్పీడీసీఎల్ జాయింట్ సెక్రటరీ రమేశ్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా రెండు, మూడు రోజుల్లో నియామక ఉత్తర్వులు అందించనున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, సమాజంలో మహిళా శక్తిని ముందుకు తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశంగా ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం కలెక్టర్ రాహుల్ శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మాయాంక్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈ క్యాంటీన్ల ఏర్పాటు ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ, స్థానిక ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించడానికి దోహదపడతారని పేర్కొన్నారు. అంతకు ముందు మహిళా సంఘాలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీఓ అవినాశ్, డీపీఓ నారాయణరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్, మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ జెడ్పీటీసీ అరుణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, మహదేవపూర్ తహసీల్దార్ ప్రహ్లాద్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

డెంగీతో విద్యార్థిని మృతి


కల్యాణి(ఫైల్)

చెన్నారావుపేట: డెంగీ జ్వరంతో ఓ విద్యార్థిని మృతిచెందింది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెం దేవేందర్ – రమ దంపతుల కూతురు కల్యాణి(20) ప్రభుత్వ ఉద్యోగాల కోసం హైదరాబాద్ అమీర్‌పేటలో కోచింగ్ తీసుకుంటుంది. ఇటీవల జ్వరం రావడంతో వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. జ్వరం తక్కువైనట్లు అనిపించడంతో హనుమకొండలోనే బంధువుల ఇంటికి వెళ్లారు. మళ్లీ జ్వరం రావడంతో ఎంజీఎం తీసుకెళ్లారు. ఎంజీఎం వైద్యులు డిశ్చార్జి చేయకముందే వెళ్లారని కోపం చేశారు. దీంతో వారు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామానికి చెందిన వ్యాపార వేత్త పులి దేవేందర్, గ్రామ పెద్దలు పెరుమాండ్ల లక్ష్మారెడ్డి, వట్టి రాంరెడ్డి, పరికి మధూకర్, భాషమియా, ఉమారెడ్డి.. కల్యాణి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చదువుకున్న పాఠశాలకే హెచ్‌ఎం..

● ఓ టీచర్‌కు దక్కిన అరుదైన అవకాశం


గార్ల బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుందర్‌కుమార్

గార్ల: ఓ ఉపాధ్యాయుడు చిన్నప్పుడు తాను విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకే ప్రస్తుతం హెడ్‌మాస్టర్ అయ్యాడు. దీంతో సహ ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆ ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించి అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. గార్లకు చెందిన మాచర్ల సుందర్ కుమార్ తన చిన్నప్పుడు గార్లలోని యూపీఎస్, హైస్కూల్లో చదువుకున్నాడు. యూపీఎస్ ప్రస్తుతం బాలికోన్నత పాఠశాల అయ్యింది. ఈ క్రమంలో గత నెల 30వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం రత్నకుమార్ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సీనియారిటీ ప్రకారం ఇదే మండలంలోని పెద్దకిష్టాపురం పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాచర్ల సుందర్‌కుమార్ జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మంగళవారం గార్ల బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు.

మానవతావాదానికి ప్రతీక గాంధీ

● ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి


మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ : స్వచ్ఛత, ఆత్మ నిర్భరత, మానవతావాదానికి ప్రతీక గాంధీ అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతిని జరుపుకున్నారు. గాంధీ చిత్రపటానికి సీఎండీ, డైరెక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు కె.రాజు చౌహాన్, కె.కిషన్, రవీంద్ర నాథ్, అశోక్, కె.ఎన్ గుట్ట, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, జీఎంలు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు సస్పెన్షన్

- మరో ఇద్దరు ఉద్యోగులు కూడా..
- కాంట్రాక్టు ఉద్యోగి టర్మినేషన్
- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు


రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న ఏఆర్ అశోక్‌బాబు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూమిలో ఇళ్లు నిర్మించారని హనుమకొండ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబును సస్పెండ్ చేస్తూ కేయూ రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 229 సర్వేనంబర్ భూమిలో అశోక్‌బాబుతో పాటు మరో ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, ఓ కాంట్రాక్టు ఉద్యోగి గృహాలు ఉన్నట్లు సర్వే రిపోర్టు ద్వారా వెల్లడైంది. దీంతో మల్లారెడ్డి, ఏఆర్ అశోక్‌బాబుకు మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని మెమోను జారీచేశారు. అయితే సర్వేనంబర్ 235లో తన భార్య సుమతల పేరు మీద ఇళ్లు ఉందని వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం కేయూలో గాంధీ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తుండగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు అక్కడికి వచ్చారు. కార్యక్రమం అనంతరం రిజిస్ట్రార్‌కి ఇబ్బంది కలిగించే విధంగా వాగ్వాదం చేసి, న్యూసెన్స్ సృష్టించారని రిజిస్ట్రార్ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని అశోక్‌బాబు ఉల్లంఘించారని, ఇన్‌చార్జ్ వీసీ ఆదేశాల మేరకు అతడిపై సస్పెన్షన్ వేటు వేశారు.

మరో ఇద్దరు ఉద్యోగులపై వేటు.. కాంట్రాక్టు ఉద్యోగి టర్మినేషన్

కేయూ క్యాంపస్‌లోని పబ్లికేషన్ సెల్‌లో వేయిటర్ విధులు నిర్వర్తిస్తున్న పి.ఎల్లస్వామి, బయోకెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్న టి.బుచ్చయ్యను సైతం సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. వీరితో పాటు జాతీయ సేవాపథకం యూనిట్‌లో కాంట్రాక్టు డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టి.యాదగిరిని విధుల నుంచి టర్మినేషన్ చేస్తూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

పర్యావరణ రక్షణకు వాసవీక్లబ్ కృషి

● రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి


సీడ్‌బాల్స్‌తో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, వాసవీ క్లబ్ బాధ్యులు, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్ : పర్యావరణ రక్షణకు వాసవీ క్లబ్‌లు కృషి చేస్తున్నాయని, 20వేల సీడ్‌బాల్స్ తయారు చేయించి పర్యావరణానికి జీవం పోస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కేయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) విద్యార్థులతో ఇటీవల సీడ్‌బాల్స్ తయారు చేయించారు. వివిధ రకాల విత్తనాలతో తయారు చేసిన సీడ్‌బాల్స్‌ను క్యాంపస్‌లోని పలుప్రాంతాల్లో బుధవారం వెదజల్లారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడారు. పర్యావరణ రక్షణలో వాసవీ క్లబ్ భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, వాసవీ క్లబ్ బాధ్యులు, కేయూ పాలకమండలి సభ్యులు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్ట్..

● వివరాలు వెల్లడించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి



నిందితుల అరెస్ట్ చూపుతున్న హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: ముగ్గురు దోపిడీ దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 900 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేవన్నపేట ప్రాంతానికి చెందిన బాధితుడు సెప్టెంబర్ 30న మధ్యాహ్న సమయంలో దేవన్నపేటకు వెళ్లేందుకు కిరాయి ఆటో కోసం గోపాల్ పూర్ క్రాస్ వద్ద ఆగి ఉన్నాడు. ఈ క్రమంలో నిందితులు లష్కర్ సింగారం గ్రామానికి చెందిన జన్ను రాజ్‌కుమార్, పోచమ్మమైదాన్‌కు చెందిన కట్కూరి యాకూబ్, కట్కూరి రేణుక.. ఒక్కసారిగా వెనుక నుంచి వచ్చి బాధితుడుని తీవ్రంగా కొట్టారు. అనంతరం గుర్తు తెలియని ఆటోలో పోచమ్మ కుంట శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లి అక్కడ బాధితుడుని మరో మారు తీవ్రంగా కొట్టి అతడి వద్ద ఉన్న రూ. 10 వేల నగదు, సెల్‌ఫోన్ దోచుకోవడంతోపాటు గూగుల్ పే నుంచి రూ.వెయ్యి తమ ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. ఈ ఘటనపై బాధితుడు హనుమకొండ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో నిందితులను హనుమకొండ బస్టాండ్ దగ్గర అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

సంస్కృతిని కాపాడుకుందాం..

● బతుకమ్మ సంబురాల్లో మంత్రి కొండా సురేఖ


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో మేయర్ సుధారాణి

ఖిలా వరంగల్: తెలంగాణ సంస్కృతితితి, సంప్రదాయాలను కాపాడుకుందామని, మహిళా అభ్యున్నతికి సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం రాత్రి వరంగల్‌శివనగర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ ముఖ్యఅతిథిగా హాజరై మేయర్ గుండు సుధారాణితో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.24 లక్షల వ్యయంతో రామాలయ అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాంరాజేశ్, నవీన్, సాంబయ్య, రవికంటి అశోక్, అడెపు శ్యాం, కుడికాల సుధాకర్, బుధారపు భాస్కర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ

- నిజామాబాద్‌పై కరీంనగర్..
- ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపు


గెలుపొందిన ఖమ్మం జిల్లా జట్టు క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్ : వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 అంతర్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం కొనసాగాయి. ఈ టోర్నమెంట్‌లో కరీంనగర్, ఖమ్మం జిల్లా జట్లు విజయం సాధించాయి. కోమటిపల్లి గ్రౌండ్‌లో నిజామాబాద్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50 వర్లకు 49.3 ఓవర్లు ఎదుర్కొని 192 పరుగుల స్కోరు చేసింది. కరీంనగర్ జట్టులో విఘ్నేశ్ 55 పరుగులు, అఫ్రిది 35 పరుగులతో రాణించారు. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో కేవలం 74 పరుగుల వద్ద అన్ని వికెట్లను కోల్పోయింది. 118 పరుగుల తేడాతో ఓటమి పాలయ్యింది. మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు కేవలం 29.3 ఓవర్లను ఎదుర్కొని 109 పరుగుల వద్ద అన్నీ వికెట్లను నష్టపోయింది. బ్యాట్స్‌మెన్ సయ్యద్ 32 పరుగులు, స్మిత్ 24 పరుగులు చేయగా ఖమ్మం బౌలర్ నేహిత్ 5వికెట్లను సాధించాడు. అనంతరం 110 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఖమ్మం జట్టు రత్న ఆర్యన్ 43 పరుగులు, రాంవర్ధన్ 29 పరుగులతో రాణించారు. 30.1 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 111 పరుగులు సాధించి 5 వికెట్ల తేడాతో విజయం సాధించారు. నేడు (గురువారం) మొగిలిచర్ల గ్రౌండ్‌లో ఆదిలాబాద్, కరీంనగర్ మధ్య, కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్ జట్ల మధ్య మ్యాచ్ ఉంటుందని వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

చిన్నారిని కాటేసిన పాము

కాళేశ్వరం: చిన్నారిని పాము కాటేసింది. ఈ ఘటన బుధవారం రాత్రి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగింది. గ్రామానికి చెందిన పులి మోహన్ కాళేశ్వరం దేవస్థానం ఆవరణలో హోటల్ నిర్వహిస్తున్నాడు. తన కుమార్తె జాహ్నవి హోటల్‌లో కూర్చుంది. ఈ క్రమంలో ఫ్రిజ్ కింది భాగం నుంచి వచ్చిన పాము చిన్నారిని కాటు వేసింది. దీంతో తల్లిదండ్రులు వెంటనే భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందిస్తున్నారు.

నిత్యం సంచారం!

దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ పరిధిలో చెత్త పేరుకుపోవడంతో నిత్యం పాములు సంచరిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆలయ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో సరైన వసతులు కల్పించడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

నేటినుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

● వివిధ అలంకరణలో భద్రకాళిదేవి, రుద్రేశ్వరీ అమ్మవార్ల దర్శనం


భద్రకాళి అమ్మవారికి హరిద్రాభిషేకం

హన్మకొండ కల్చరల్ : చారిత్రాత్మక భద్రకాళి దేవాలయంలో నేడు(గురువారం) నుంచి 13వ తేదీ(ఆదివారం) వరకు శ్రీభద్రకాళిదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజు ప్రాతఃకాల పూజలు, అర్చనలు, వివిధ క్రమాలలో అమ్మవారిని అలంకరించి విశేష సేవలు జరిపిస్తారు.అమ్మవారి అలంకరణలో భాగంగా గురువారం తెల్లవారుజామున ధ్వజారోహణము, కళశ స్థాపన, నవరాత్రివ్రతారంభం, శైలపుత్రీక్రమంలో బాలాత్రిపురసుందరీ అలంకరించి పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం బ్రహ్మచారిణీ క్రమంలో అన్నపూర్ణగా, శనివారం చంద్రఘంటాక్రమంలో గాయత్రీ అలంకారం, ఆదివారం కుష్మాండీక్రమంలో శ్రీమహాలక్ష్మీ అలంకారం, సోమవారం స్కంధమాతాక్రమంలో శ్రీరాజరాజేశ్వరీ లలితా మహాత్రిపుర సుందరి అలంకారం, మంగళవారం కాత్యాయినీఅలంకారం, బుధవారం కాళరాత్రిక్రమంలో సరస్వతీ అలంకారం, గురువారం మహాగౌరీ క్రమంలో శ్రీభద్రకాళి మహాదుర్గాలంకారం, దుర్గాష్టమి శ్రీభద్రకాళి జన్మదినోత్సవము సందర్భంగా విశేషఅభిషేకకాలు, శుక్రవారం మహానవమి సిద్ధిదాత్రీక్రమంలో మహిషసురమర్ధిని అలంకారం, శనివారం విజయదశమి సందర్భంగా విశేషపూజలు, శ్రీభద్రకాళి అమ్మవారి నిజరూప దర్శనం, సాయంత్రం 7 గంటలకు హంసవాహన తెప్పోత్సవం, 13న ఆదివారం శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ తంతును అర్చకులు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం అంకురార్పణ పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారిని 40కిలోల పసుపుతో అభిషేకం నిర్వహించారు.

వేయిస్తంభాల దేవాలయంలో ..


భద్రకాళి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేయిస్తంభాల దేవాలయంలో శ్రీరుద్రేశ్వరీ శరన్నవరాత్రి మహోత్సవాలు నేడు(గురువారం) నుంచి 12న శనివారం వరకు జరుగనున్నాయి. అమ్మవారికి వివిధ అలంకారణలో పూజలు నిర్వహించనున్నారు. 3న బాలాత్రిపుర సుందరిదేవీగా, 4న అన్నపూర్ణాదేవి, 5న గాయత్రిదేవి, 6న మహాలక్ష్మిదేవి, 7న శ్రీలలితా మహాత్రిపురసుందరి, 8న శ్రీభవానీదేవి, 9న శ్రీమహాసరస్వతిదేవి, 10న శ్రీరుద్గాదేవి, 11న శ్రీమహిసురమర్ధిని, 12న శ్రీరాజరాజేశ్వరీదేవి, విజయదశమి, శమీపూజలు జరుగుతాయి. ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.